

# ప్రతీకారము

డాక్టర్ నేలటూరి వేంకటరమణయ్య

౧

లేచి కూర్చుండినది పడకమీద; గాజు కుప్పెలో వెలుగుచున్నది నలుసంతటి దీపజ్వాల. డమస్కు పట్టు ఒరగుపై రెండు మోచేతు లూను కొని, కాళ్లు ముందునకు చాచి కూర్చుండినది; కొంత సేపు కూర్చుండి నది యేమో చింతింపుచు- తరు వాత పరికించి చూచినది పడకటింటిని. చీకటి యందు మునిగియుండినవి వస్తువు లన్నియు. దేనిమీదను ఆగలేదు ఆమె దృష్టి. గది నంతటిని దిలకించి మరలివచ్చినవి పడక మీదికి ఆమె కన్నులు. ప్రక్కను బరుండిన పురుషరూపము నాపాదమస్తకమును నిదానించి చూచినవి. ముఖమున మందహాస మంకురించినది. చక్కగ పద్మాసనము వేసి కూర్చుండి యతని రెండు చేతు లను బట్టి యూచినది.

"ఊఁ" అని పెడముగ దిరిగి మరల నిద్రించ గడగినాడు. మరల నతని గదలించినది. జవాబు లేదు. చేతితో తట్టి, 'లేవరాదూ. వయసు మగవాడి కిదేమి నిద్ర?' అని గేలిచేసినది. "పో, అక్ఫీల్, తొలగిపో" యని యామెను త్రోసి మరలకన్నులు మోడ్చినాడు. అంతట నామె దిస్సవార నవ్వినది యొక తీగెనవ్వును. నిశ్శబ్దమైన యా యర్థరాత్రి కాలమున మారుమ్రోగినది యామె నవ్వు మహ లంతటను. కిలకిలమను నామె సుదీర్ఘమైన నవ్వును కలకలమను ప్రతిధ్వనుల మ్రోతయు నతనికి ప్రబో ధము గల్గించినవి. దద్దరిల్లి లేచి కూర్చుండినాడు. నల్లగడ్డమున సగము మ్రింగియుండిన విశాలమైన ముఖము తామ్రపు హరివాణమువలె జేవురించి నది; కన్నులు చండ్రనిప్పులువలె ప్రజ్వరిల్లుచు క్రోధానలజ్వాలల గ్రక్కుచుండినవి. కాని యామె జంకలేదు. అతని వైఖరిని జూచి చిరునగవు చిందులుద్రొక్కు పెదవులను దెఱచి యన్నది: "అబ్బ! ఏమి మోహము తమ కీనిద్రాదేవి మీద." ఆమె మాటల మెత్తనదనము వలన మొక్కవో యిన కోపముతో 'అయేజిన్, సైతాను కూతురా! నీకు తృప్తి యెప్పుడు? ఇసుక నీటినివలె నాసత్త్వము నంతటిని త్రాగివేయుచున్నావు. చేసయని మొసలి నోటియందు చేయి పెట్టినట్లయినది నా గతి" యని గద్దించి పలికినాడు.

"ఏలినవారు క్షమించవలయును నా యఱ గొండెతనమును. తమ జనానాలోని పడుచుపిల్ల లను జూచినప్పుడెల్ల తమరు సెలవిచ్చినట్లె ఖోజ్జా లును జిన్, పిసాచీ, యాఫరీతులని పలుకుచుందురు. సుల్తానువారెట్లో గులాములుగూడ నట్లేకదా!"

ఆమె మాటల యర్థమును గ్రహించినాడు. రగులుచుండిన నిప్పు గాలితాకుడుచే భగ్గుమనునట్లు మండిపడి మంచముమీదనుండి క్రిందికి దూకి యామెను చేయిపట్టి యీడ్చి నేలపై ద్రోసి మంచపుకోటికి దగిలించియుండిన బాకును ఒరనుండి పెరికి పొడుచుటకు చేతి నెత్తెను; కాని యామె బెదర లేదు; ప్రాణభయ మించుకంతయును గనుపఱచక మునుపటివలెనే నవ్వినది కలకలమని. అతని మన సొకింత మెత్తగిలినది; ఎత్తిన చేతిని దింపి యబ్బు రముతో నడిగినాడు. 'చావన్న భయములేదా? మృత్యుముఖమున నవ్వెట్లు వచ్చినది నీకు?'

'ఏలినవారి శౌర్యమునుగాంచిన నెవ్వరికి నవ్వు రాదు? ఒక యబలను సంతుష్టిపెట్టజాలక—'

"మరల మొదలుపెట్టుచున్నావు; ఎత్తిన బాకును దింపినది పొరపాటు."

"తమ చిత్తమువచ్చినట్లు చేయవచ్చును. కలి గిన మాట జెప్పిన కంటిలో ఫుల్ల బెట్టిన ట్లనెదరు పెద్దలు- ఎచ్చటనో కుగ్రామమున సుఖముగ నున్న దానిని నానాదుఃఖముల పాలుజేసి భర్తను తలి

దంద్రులను వధించి యీడ్చి తెచ్చితిరే? ఏమి సౌఖ్య మనుభవించుటకు? తుదకు దేనికొఱకు..."

"చాలు, చాలు, నోరుమూయుము - నీవంటి సిగ్గుమాలిన యాడుదాని నెచ్చటను జూడలేదు."

"కావచ్చును; కాని ఏలినవారే కదా నా సిగ్గును జెఱచినది- దానివిషయమైన చర్చ అనవసరము. ఒకప్రశ్న నడిగెదను. కోపమును జెందక వాస్తవమును సెలవిత్తురా?"

"ఏమిటా ప్రశ్న?"

"నా మనవి వింటిరి కదా?"

"కానీ."

"తమరెప్పుడును ఇట్లేయుంటిరా? లేక ఇటీవల గలిగినదా ఈమార్పు?"

"............"

"పలుకరేమి?"

"విను, చెప్పెదను-విని మరల నవ్వవు గదా."

"ఏలినవారీ దాసురాలి దుండగమును మన్నింపవలయును."

"మన్నన కేమిగాని-చెప్పు నవ్వుదువా?"

నేలమీదినుండి యంతటలేచి యామె మంచముపై గూర్చుండి యతనిదగ్గరకు చేరదీసుకొన్నది. రెండు చేతులతో నాతనిముఖమును బట్టుకొని తనముఖము వైపు ద్రిప్పుకొని చెప్పినది, 'నవ్వను, నవ్వను, నవ్వను' అని ముమ్మాఱు.

'విను. కన్ననూరు కుప్పమున కాఫరుల ఫౌజును నాశనముచేసిన తరువాత చెంగమ ప్రాంతమునకు దండు వెడలిపోయినాడను; ఒకనాడు అడవిలో విడిసియుండగా మామూలుప్రకారము సిపాయీలు తత్పూర్వదినమున కైదీసేయబడిన కాఫరులను నా ముందునకు దోడ్కొనివచ్చిరి. వారిని యథాప్రకారము చంప నుత్తరు విచ్చినాను. వారిలో నొక ముసలి బ్రాహ్మణుడు నతని భార్యయు చక్కని యీడువచ్చిన కుమార్తెయు నుండిరి. వారిని నా ముందు నిలువబెట్టినప్పుడు ఒకఫకీరు,-ఎచ్చటనుండి వచ్చినాడో తెలియదు-సముఖమున నిల్చి, వారిని విడిచి పుచ్చవలయునని బతిమాల నారంభించెను. కాని యాతని వేడికోలును చెవినిబెట్టక కుమార్తెను జనానా గుడారములోనికి దోడ్కొని పొండని ఖోజ్జాలకాజ్ఞయిచ్చి యామె తలిదండ్రుల నిరువురిని నచటనే యాఫకీరు కన్నుల ముందఱనే తలలు నఱికించితిని. ఆ ఫకీరు మహాకోపముతో నావంక చుఱచుఱ జూచి ఇట్లు శపించినాడు. "అయే మలఊన్, నీకు పోగాలము సమీపించినది; అల్లా కటాక్షము నీమీదినుండి తొలగిపోయినది. ఆ వృద్ధులరక్తమును చిందించినావు. వారిని సంరక్షింప జాలకపోయినాను; ఆ పడుచును నీవు స్పృశింపవలదు. నామాట నుల్లంఘించితివా, దాని ఫలము ననుభవింతువు.' ఆ మాటలను నేను లక్ష్యపెట్టక నవ్వితిని. ఆఫకీరంతట 'అల్లహాకే నాంకర్, అల్లహ రసూల కేనాంకర్' అని యల్లా నామస్మరణ జేయుచు వెడలిపోయినాడు. ఆ రాత్రి యాతని యాజ్ఞ నుల్లంఘించితిని. అప్పటినుండి ప్రారంభమైనది నా ప్రస్తుత దుస్థితి."

"ఏలినవా రా ఫకీరునే శాపమును గ్రమ్మఱింపమని ప్రార్థించలేదా?"

"అతడు మరల గానవచ్చిన గదా."

"వెతికింపలేదా?"

"రాజ్యమందలి మసీదు మసీదందును, గ్రామ గ్రామమునందును వెతకించితిని. అడ పొడగానరాక పోయినాడు ఏమయినాడో?"

"ఆయన కానరాకపోయిన లోకము గొడ్డుపోయినదా? మహాత్ము లెందఱు లేరు."

"ఉన్నారు, మతవిషయములో. కాని, మంత్రవిషయములో? పేర్కొన దగిన వారి నందఱిని వేడుకొన్నాను. నీకు తెలిసిన గొప్ప మహాత్ముని నొకని గూడ ప్రార్థించినాను."

"ఆయన ఎవరో పేరు చెప్పరాదా?"

"చెప్పరాకేమి? ఇటీవల సిరందీబునుండి వచ్చినాడే యా యరబీ తత్వజ్ఞుడు ఇబ్నేబతూతా; ఆయన నుల్లైమానంతటి వాడని మా మహమ్మదీయ ప్రపంచములో నంతట ప్రఖ్యాతి. డిల్లీ పాదుశాహు మహమ్మద్ బిన్ తుఘ్లకు వంటి నుహనీయుం డతని ప్రజ్ఞకు మెచ్చుకొని డిల్లీలో పెద్ద కాజీ యుద్యోగము నిచ్చి తన సంస్థానమునసె నిలుపుకొన్నాడు. పాదుశాహువారి యాజ్ఞమీద మహాచీనాకు బోవుచు మార్గమున మా యాస్థానమునకు వచ్చినాడు."—

"ఆయన ఏమన్నారు?"

"నా కథను విని ఆయన చెప్పినాడు 'ఆ ఫకీరు నాపై మంత్రప్రయోగమును జేసినా' డని."

"అంతయేనా?"

"ఇదుగో చూడు నా మెడయందలి తాయె

త్తును. దానిని మంత్రించి స్వయముగ ఆయన నా కంఠమున గట్టినాడు; కట్టి ఇప్పటికి నెలరోజులు కావచ్చినవి- రానురాను నా శక్తి తగ్గుచున్నదే కాని హెచ్చుటలేదు."

అనిచెప్పి నిట్టూర్చినాడు; ఆమె కొంతసేపు యోచన సేయుచు మౌనముగ కూర్చున్నది. తరువాత నతని గాఢముగా కౌగిలించుకొని చెప్పినది- 'ఏలినవారు భ్రమపడుచున్నారు' అని-

"భ్రమయా ! నన్ను గేలిచేసెదవా ?"

"లేదు ప్రభూ, మీ యస్వస్థతను భ్రమయనుటలేదు."

"మఱి ?"

"ఫకీరు శాపమువలన మీకుజబ్బుగలిగినదనుట."

"అప్పటినుంచియే నా కీయవస్థ సంప్రాప్తమైనది ! అంతకుముందు లేదే ?"

"చెట్టుపై కాకి వాలుటకును తాటిపండు నేలపై బడుటకును నెంత సంబంధము గలదో యంత సంబంధమే కలదు— మీ జబ్బునకును ఫకీరు శాపమునకును."

"మఱి నా కీ దురవస్థ సంప్రాప్తమగుటకు గారణము ?"

"నరముల పుష్టి తగ్గుటవలన- మంత్రములవలన లాభములేదు- వైద్యమువలన మీరు యథాస్థితిని బొందగలరు."

"ఎందఱు హకీములను పిలిపించినాడను, ఎన్ని యౌషధములను సేవించినాను- లాభ మేమియు లేదు- ఆ పాడు ఫకీరుమాట తప్పదు."

"అట్లనవలదు ప్రభూ- మీ జబ్బు వనమూలికల వలనగాని కుదురదు; అవి దేశాటనము సేయు సాధువులకడగాని లభ్యపడవు."

"సాధువులా ! వారొక్కరే బాకి."

"నా మనవి నాలించరా ?"

"కానీ, వ్యాధివచ్చినవాడు వెఱ్ఱివా డందురు కదా !"

## ౨

మిట్టమధ్యాహ్నము; ఎండ నిప్పుయి వెదజల్లుచుండినది. తామ్రపర్ణి ఒడ్డున తిరునల్వేలి పరిసరముల తాటితోపు. తాటిచెట్ల నడుమ నచటచట తురక గుడారములు. వాని మధ్య ఖక్కురులోపల తొగటి గుడారము; దాని కిరుపార్శ్వములందును పది పండ్రెండు చిన్న తెల్ల డేరాలు. తొగటి గుడారము వాకిట నేజాపై నానుకొని నిలిచియుండినాడు పహరా సిపాయి. గుడారములో మంచముపై సుల్తాన్ ఘయాజుద్దీను దాఘ్నుపుషా నిద్రించుచుండినాడు. క్షణ క్షణమునకును మార్పు జెందుచుండిన యాతని ముఖవిలాసమును గాంచిన యతడేదో కల గనుచుండెనని తెల్లమగుచుండెను. చిరునవ్వుతో వికసించియుండిన ముఖమం దున్నట్టుండి భయచిహ్నములు బొడసూపినవి. దేహము జడత్వ మంది యుండినను అంతరంగము కలత నంది యుండెనని విస్పష్ట మగుచుండినది. గడ్డమందలి వెండ్రుకలు నిక్కవొడిచినవి; ఊపిరి యాడక కష్టముతో నుచ్ఛ్వసించుటకు ప్రయత్నము సేయుచుండినట్లు గానవచ్చినది. రెండు మూడు మారులు గొంతునందు గురగురమను నస్పష్ట శబ్దములు వినవచ్చినవి. కావుకూత వేసి దద్దరిలి మంచముమీద నుండి క్రిందికి దొర్లినాడు. ఆ కూతను విని పహరా సిపాయి సత్వరముగ శిబిరములోనికి ప్రవేశించెను. ఆ సమయముననె డేరా కుడిప్రక్కనుండి తెఱను దొలగదోసుకొని వచ్చినది ప్రక్కగుడారమునుంచి యొక యౌవనవతి. ఆమెను జూడగనె సిపాయి వేగిరపాటుతో వెనుదిరిగిపోయి యథాస్థానమును జేరెను. ఇంతటనె సుల్తానునకు ప్రబోధము గలిగెను. ఆమెయు దాపునకు వచ్చి యతని మూపులపై హస్తతలముల నిడి భయపడిన బిడ్డ ననునయించు తల్లివలె బుజ్జగపు మాటల దిన్నగ నడిగినది. 'మహా ప్రభూ, ఏలినవారి విశ్రాంతికి భంగ మెట్లు కలిగినది? తాము కొందల మందినట్లు గానవచ్చుచున్నారే. దేనివలన తమకు తత్తరపాటుకలిగినది?'

ఆమె మాటలకు జవాబు సెప్పకయే గర్జించినాడు 'అయే దర్వాన్!' అని.

"జహాన్ పనా" అనుచు లోపలికి వచ్చి వంగి సలాము చేసినాడు పహరా జవాను. వానివైపు తీక్ష్ణదృష్టుల బరపుచు గద్దించినాడు- "నిద్రపోవుచుంటివా? డేరాలోనికి ఎవ్వరికి ప్రవేశము లేదని ఎఱుగవా?"

"మఖ్దూమా జహాఁ వారిక్కా-"

"అయే, బేఅకల్, మఖ్దూమా జహాఁ కాదు."

"మఱీ యెవ్రూ రాలేద్ హుజూర్."

"రాలేదూ? రాలేదూ? బాహిర్ చలో."

పహరా జవాను భయవిహ్వలుడై యథాస్థానమునకు బోయెను. మరల ఆ యౌవనవతి యడిగి

నది, 'ఎవరు వచ్చినారు మహాప్రభూ తమకు నిద్రా భంగమును గలిగించుటకు?' అని. మంచముమీద చదికిలబడి చెప్పినాడు- 'మహారాజవాను చెప్పినది నిజమే. ఎవ్వఱును రాలేదు' అని.

"మఱి తమకింత క్షోభయేల కలిగినది?"

"ఆఫకీరు వచ్చి-"

"రాలేదంటిరే యెవ్వరును?"

"రాలేదు, ఫకీరు రాలేదు; అతని యాత్మ వచ్చినది; వచ్చి నాఱొమ్ముపై గూర్చుండినది. ఆ కడుచు నేమిచేసితివని గదమాయించినది; ఱొమ్ము మీద గుద్దినది; గొంతును నులిమినది. చూడు, మెడచుట్టును ఎట్లు కదుములు గట్టియున్నవో?"

"రాలేదు, మహాప్రభూ, రాలేదు - ఫకీరుగాని యతని యాత్మగాని."

"రాలేదా!"

"రాలేదు, రాలేదు, రాలేదు-కేవలము భ్రమ."

"భ్రమయా? నేను స్పష్టముగ చూచితినే? అతని కరస్పర్శ ఇంకను నాకంఠము చుట్టును దగులు చున్నట్లున్నదే."

"కలగంటిరి అంతే."

"కలయా! ఎంతటి పాడుకల! ఎంత నిజ ముగదోచినది?"

"నరముల పుష్టితగ్గినప్పుడు ఇటువంటి మనోవికారములు కలుగుట సహజము.ఏలిన వారు నావిన్నపము నాలకించి తగు చికిత్స యొనర్చియుండిన ఈబాధకలిగియుండదు."

"నరముల పుష్టికిని నాకువచ్చిన కలకును నేమి సంబంధము? మాటవరుసకు ఉన్నదనుకొన్నను అది కుదురు మార్గము గానరాకున్నది; దేశమునందలి హకీములను వైద్యులను అందరిని రప్పించి వారు చెప్పిన యౌషధముల నన్నిటిని సేవించితిని."

"హకీములవలనను వైద్యులవలనను. తమకు మేలుకలుగదని నేను ఇంతకుముందె మనవి చేసికొని యున్నాను."

"అవును, జ్ఞప్తియందున్నది. నీవు చెప్పినట్లు సాధువులమూలమున నా జబ్బు స్వస్థపడునని యనుకొన్నను దొరకని మందవలన లాభమేమి?"

"సాధువులు లేరా?"

"ఉన్నారో లేరో. ఎంత వెతకించినను ఒక్కడైనను గానరాలేదు."

"ఉన్నారు, ఉన్నారు. ఏలినవారివలని భయముచే దాగినారు."

"భయమా? నేనేమి చేసితిని వారిని?"

"కనుపడిన హిందువుల నందరిని ప్రత్యక్ష మృత్యువువలె వధించు తమ సముఖమునకే సాధువు రానిచ్చగించును?"

"మఱి నాకు వారివలన మేలెట్లు కలుగగలదు?"

"ఏలినవారి యాజ్ఞయైన ఈ దాసురాలు తోడ్కొని రాగలదు."

"ఎప్పుడు?"—"మధుర జేరినవెంటనే."

(వచ్చే సంచికలో ముగింపు)

